క్లుప్తంగా

చిన్నారులకు వ్యాయామ సైకిళ్ల పంపిణీ



కారెంపూడి: స్థానిక వినుకొండ రోడ్డులోని అంగన్ వాడీ కేంద్రం చిన్నారులకు తహసీల్దార్ జి శ్రీనివాసయాదవ్ మంగళవారం మినీ వ్యాయామ సైకిళ్లు పంపిణీ చేశారు. వయస్సు తగ్గ ఎత్తు బరువు లేని చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ చిన్నారులకు వీటిని అందించారు. అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తలు ఇటువంటి చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చి వారికి పౌష్టికాహారం చక్కగా అందించాలని కోరారు. చిన్నారులను ఆటలు ఆడిస్తూ వ్యాయామ పరికరాల ద్వారా వ్యాయామాలు చేయించాలని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. బాలామృతం, కోడి గుడ్లు, పాలు బాలింతలు గర్భిణులకు తహసీల్దార్ పంపిణీ చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబానికి చేయూత



కారెంపూడి: మండలంలోని చినగార్లపాడు గ్రామంలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఊటుకూరి శివయ్య కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సాయాన్ని గ్రామ పార్టీ నాయకులు మంగళవారం అందించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు గ్రామ పార్టీ నాయకులు ఆ కుటుంబాన్ని పరామర్శించి శివయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. గ్రామ సర్పంచ్ బద్దూరి శ్రీనివాస రెడ్డి, గ్రామ పార్టీ కన్వీనర్ అన్నపరెడ్డి పుల్లారెడ్డి, వాసురెడ్డి, ఎంపీటీసీ డేవిడ్, మాజీ ఎంపీటీసీ కోటేశ్వరరావు, భూషణం, కిరణ్‌కుమార్ తదితరులు శివయ్య కుటుంబాన్ని పరామర్శించి సాయం అందించారు. శివయ్య కుటుంబానికి ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉంటామని గ్రామ పార్టీ నాయకులు ఈ సందర్భంగా చెప్పారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గురజాల : మండల పరిధిలోని పల్లెగుంత గ్రామంలో గల ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చేర బోవు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఉషశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 6వ తరగతి విద్యార్థులకు ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 11వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూప్ నందు ఆసక్తి కలిగిన విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 7వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సేవా దృక్పథం కలిగివుండాలి

గురజాల : సేవా దృక్పథం కలిగివుండాలని నగర పంచాయతీ వైస్ చైర్ పర్సన్ షేక్ జబీ జానీ అన్నారు. స్థానిక పాతపాటేశ్వరమ్మ దేవాలయం వద్ద స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా వైస్ చైర్ పర్సన్ పాల్గొని మాట్లాడుతూ నిరుపేదలకు సహాయం చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో షేక్ నాగులుమీరా, ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీవిశ్వనాదం, బండి రవికుమార్, కొత్తపల్లి సాంబశివరావు, అనిగ్రేస్ స్వచ్ఛంద సేవా సంస్థ, తదితరులున్నారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

దుర్గి: ప్రసిద్ధిగాంచిన శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో బుధవారం అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీగిరిరాజు నర్సింహబాబు తెలిపారు. ప్రత్యేకాధికారి పర్యవేక్షణలో లెక్కింపు కొనసాగుతుందన్నారు.

'సాక్షి' కి స్పందన



దుర్గి: ''విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు'' అనే శీర్షిక సోమవారం సాక్షిలో ప్రచురితమైంది. దీనికి స్పందించిన స్థానిక విద్యుత్ అధికారులు మంగళవారం కంచరగుంట గ్రామంలో ఇరిగిపోయిన పాత స్తంభాన్ని తొలగించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంత ప్రజలకు విద్యుత్ సౌకర్యం కలగడంతో గ్రామస్తులు సాక్షి కి కృతజ్ఞతలు తెలిపారు.

పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక

మాచర్ల : సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధిని చూసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వైఎస్సార్‌సీపీ వైపు ఆకర్షితులవుతున్నారని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో టీడీపీ మాజీ కౌన్సిలర్ తిరుమలకొండ అంజనేయులు వైఎస్సార్‌సీపీలో పీఆర్కే సమక్షంలో చేరారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో పీఆర్కే కేక్ కట్ చేసి అంజనేయులు దంపతులకు, ఆయన అనుచరులకు పార్టీ కండువాకప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. నాలుగు సంవత్సరాల క్రితం అధికారం చేపట్టిన సీఎం ఇప్పటికే 98 శాతం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేశారన్నారు. ఈనేపథ్యంలో ప్రజలు జైజైలు పలుకుతుంటే దీన్ని సహించలేని ఎల్లోమీడియా రోజుకో వివాదం చేసుకుని పత్రికల్లో, టీవీల్లో అలజడి సృష్టించడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం అలవాటైందన్నారు. నాలుగు సంవత్సరాల్లో సీఎం జగన్ చేపట్టిన అభివృద్ధి పథకాలపై ప్రజలు అవగాహన కలిగి సమస్యలు పరిష్కరించుకుంటూ పార్టీకి మద్దతు పలకాలని మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేయాలని ఆయన కోరారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి పలువురు నాయకులకు కేక్ తినిపించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పురపాలక సంఘ చైర్మన్ బోయరఘురామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్,అ బ్దుల్ జలీల్, బి.ఏడుకొండ, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఎరబోతుల శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కె.సాయిమణికంఠరెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న పీఆర్కే

క్రీస్తు స్వస్థత కూటములు



హాజరైన భక్తులు




ముఖ్య సందేశం ఇస్తున్న షరన్

మాచర్ల : ఏసుప్రభు ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపాలని కోరుతూ ఆశీర్వదించి బైబిల్‌లో పలు వాఖ్యాల ద్వారా శాంతి, ప్రేమ, తోటి వారి పట్ల అభిమానం కలిగి ఉండాలని బోధించారని సిస్టర్ షరోన్ అన్నారు. మంగళవారం రెండోరోజు మాచర్ల పట్టణ శివారులోని రాయవరం జంక్షన్‌లో స్వస్థత కూటముల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో సిస్టర్ షరోన్ ప్రత్యేక సందేశం అందించారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు సుదీర్ఘ సమయం క్రైస్తవులకు వివిధ అంశాలపై బోధించి ప్రభు ఆశీర్వాదం ఏవిధంగా పొందాలనేదానిపై బోధించారు. ప్రతి ఒక్కరూ ఏసుప్రభు పట్ల భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించాలన్నారు. ప్రతి కుటుంబంలో స్వస్థత చేకూరాలంటే ఇలాంటి కూటముల్లో పాల్గొని దేవుని ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. కూటములకు నిర్వాహకులు పాస్టర్ ప్రవీణ్‌తో పాటు, స్థానిక పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు, పలువురు వారి సందేశాన్ని భక్తులకు అందించారు. పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షరాన్ ఆధ్వర్యంలో భక్తులకు స్వస్థత చేకూరాలంటూ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు

నరసరావుపేట ఈస్ట్: పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందివ్వటం అభినందనీయమని జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్ తెలిపారు. శ్రీవాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో ఊరా చరిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఊరా భాస్కరరావు ఆర్థిక సహకారంతో అందించనున్న స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు పత్రాలను మంగళవారం మిట్టపల్లి రమేష్ తన కార్యాలయంలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ, సామాజిక సేవా కార్యక్రమాలలో ముందుండే భాస్కరరావు నూతనంగా ట్రస్ట్ ఏర్పాటు చేసి 108 మంది విద్యార్థులకు దాదాపు రూ.3లక్షలు స్కాలర్‌షిప్‌లుగా అందచేయటం అభినందనీయమని తెలిపారు. శ్రీవాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఇంటర్మీడియెట్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు పొందేందుకు అర్హులని తెలిపారు. అర్హులైన విద్యార్థులు పూర్తిచేసిన దరఖాస్తులను జూన్ 3వతేదీ లోగా అందివ్వాలని కోరారు. వివరాలకు 92464553348, 9182753404, 9885422058 నంబర్లలో సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో ఊరా ట్రస్ట్ చైర్మన్ ఊరా భాస్కరరావు, కొత్తూరి ప్రసాదరావు, తాడువాయి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్ దరఖాస్తు పత్రాలను విడుదల చేస్తున్న మిట్టపల్లి తదితరులు

పీఈటీలకు పదోన్నతికి అవకాశం కల్పించాలి

నరసరావుపేట ఈస్ట్: పీఈటీలకు ఉద్యోగోన్నతి కల్పించాలని డీఈఓకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. 2018 డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన పి.ఈ.టీలకు 2023 ఎస్.ఏ.పి.ఈ (పి.డి) పదోన్నతులకు అవకాశం ఇవ్వాలని కోరుతూ పల్నాడు జిల్లా పి.ఈ.టీ, ఎస్.ఏ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఖాదర్‌మస్తాన్, బి.స్వర్ణరాజు మాట్లాడుతూ, పదోన్నతులు పొందేందుకు నిబంధనల ప్రకారం రెండు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేయాల్సిఉండగా, మిగిలిన సబ్జెక్ట్ ఉపాధ్యాయుల కంటే తాము కేవలం 21 రోజులు వెనుకబడి ఉన్నామన్నారు. కోర్టు కేసుల కారణంగా తాము ఆలస్యంగా విధుల్లో చేరినట్లు చెప్పారు. తమను కూడా మిగిలిన సబ్జెక్ట్ ఉపాధ్యాయులతో సమానంగా పరిగణించి పదోన్నతులు కల్పించాలని అభ్యర్థించారు. ఇప్పటికే అర్హత ఉన్న పీఈటీలు లేక పి.డి. పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. అలాగే పీఈటీగా కొనసాగుతూ డిగ్రీ అర్హత ఉన్న వారికి బీపీఈడీ కోర్సు చేసేందుకు ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించాలని కోరారు.



డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న పీఈటీ అసోసియేషన్ ప్రతినిధులు

25, 26 తేదీల్లో కౌలు హక్కుల వేలం

యడ్లపాడు: మండలంలోని ఆరు గ్రామాల్లోని పలు దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన వ్యవసాయ భూములకు కౌలు హక్కుల బహిరంగ వేలం 25, 26 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఏడాది కౌలుసాగు చేసుకునేందుకు ఆసక్తి కలవారు రూ.5వేల ధరావత్తు చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాలను వేలం పాట నిర్వహణ సమయంలో తెలుసుకోవాలని సూచించారు. 25వ తేదీన దింతెనపాడు శ్రీదండేశ్వరస్వామి ఆలయానికి చెందిన 12.16 ఎకరాలు, శ్రీచెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన 12.63 ఎకరాలు, యడ్లపాడు శ్రీరాజేశ్వరస్వామి ఆలయానికి చెందిన 12.66 ఎకరాలు, రణవీరాంజనేయస్వామి ఆలయానికి చెందిన 2.58, అద్దంకి నాంచారమ్మ ఆలయానికి చెందిన 1.91 ఎకరాలు, కంద్రిక విశ్వేశ్వరస్వామి ఆలయానికి చెందిన 11.39 ఎకరాలు, జగ్గాపురం- శ్రీవేణుగోపాలస్వామి 9.42, చంద్రశేఖరస్వామి ఆలయం 5.70 ఎకరాలకు వేలం ఉంటుందని చెప్పారు. అదే విధంగా 26వ తేదీ మధ్యాహ్నం ఉన్నవ శ్రీరాజగోపాలస్వామి ఆలయ భూమి ఎకరం, శ్రీమూలస్థానేశ్వరస్వామి ఆలయం 4.42, చెంఘీజ్‌ఖాన్‌పేట- వెన్నముద్దల గోపాలకృష్ణస్వామి ఆలయానికి చెందిన 3.77, సొలస శ్రీభూసమేత రంగనాయస్వామి ఆలయానికి చెందిన 8.81 ఎకరాలు, ఊరంకమ్మ అమ్మవారు ఆలయానికి చెందిన 5.99 ఎకరాల భూములు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు.

విత్తనాలు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

వినుకొండ(నూజెండ్ల): విత్తనాలను డీలర్లు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ రవిబాబు హెచ్చరించారు. పట్టణంలోని పలు విత్తనాల దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులు పత్తి, మిరప, ఇతర విత్తనాలను కొనుగోలు లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద కొనుగోలు చేయాలని సూచించారు. ఎంఆర్‌పీ కంటే అధిక రేట్లకు విత్తనాలను విక్రయిస్తే డీలర్ల లైసెన్స్ రద్దు చేస్తామని పేర్కొన్నారు. రైతులకు విత్తనాలు అమ్మేటప్పుడు విత్తనాల కంపెనీ పేర్లు, బ్యాచ్ నంబరు, అమ్మిన ధర బిల్లుపైన రాసి రైతు సంతకం చేయించాలని, బిల్లు రైతులకు ఇవ్వాలని సూచించారు. గ్రామా ల్లో అనధికారికంగా విత్తనాలు అమ్మిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేటి నుంచి తూబాడులో రీసర్వే

నాదెండ్ల: జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పనులు మండలంలోని తూబాడు గ్రామంలో బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ ఏవీ రమణ తెలిపారు. గ్రామంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, రైతులు హాజరై పొలాల గట్లు, విస్తీర్ణాన్ని రికార్డుల రూపంలో చూపాలన్నారు. సమస్యలు వ్నట్లయితే వీఆర్వోల వద్ద పరిష్కరించుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటలకు డ్రోన్ ఫ్లైసర్వే పనులు ప్రారంభమవుతాయని, గ్రామంలో సంబంధిత రైతులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. సర్పంచి గోళ్లమూడి కాశయ్య, ఎంపీపీ తలతోటి రాణి, మండల సర్వేయర్ పాల్గొన్నారు.

నీటి నాణ్యత పరీక్షలు



విజయపురిసౌత్: మాచర్ల మండలం పశువేముల గ్రామ పరిధిలోని బ్రహ్మానందపురం తండాలో వాటర్ ఎయిడ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కర్రా చిన్న రంగయ్య మాట్లాడుతూ నీటి పరీక్షలు నిర్వహించడం వల్ల ఆరోగ్య సమస్యలకు ముందుగానే చెక్ పెట్టవచ్చని తెలిపారు. అనంతరం వాటర్ ఎయిడ్ ఇండియా సంస్థ ఐఎస్ మాడెబోయిన గురుప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో 110 కుటుంబాలకు 15 వేల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి ట్యాంక్ నిర్మాణం పూర్తి అయిందని త్వరలో ట్యాంక్‌ను గ్రామానికి హ్యాండోవర్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఇంజిర్ పవన్ కుమార్, సీఎఫ్ లక్ష్మణరావు, గ్రామ పెద్దలు మేరాజోత్ బిల్లునాయక్, కరంటోత్ పర్వతాలు నాయక్, కరంటోత్ కావేరి బాయి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి



పిడుగురాళ్ల: అనుమానస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో చోటు చేసుకుంది. తుమ్మలచెరువు గ్రామ పొలాల్లో సుమారు 50 సంవత్సరాలు వయస్సు కలిగి, చామన చాయ రంగు, బ్లూ, తెలుపు రంగు షర్టు ధరించి మగ మనిషి పెట్రోల్ బంకు వెనుక వైపు పడి ఉన్నాడని స్థానికులు తెలపటంతో పట్టణ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు. వృద్ధుడి వివరాలు తెలిస్తే పట్టణ సీఐ ఆంజనేయులు : 9440796236 నెంబర్‌కు తెలియజేయాలన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



మాచర్ల: మాచర్ల పట్టణం 25 వార్డుకు చెందిన పెట్ల ఏడుకొండలు ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. మాచర్ల మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి ఏడుకొండలు కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా నగదు రూ.10వేల రూపాయలను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

నూజెండ్ల: మండలంలోని జంగాలపల్లి, త్రిపురాపురం, తలార్లపల్లి గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీఓ జిలానీబాషా మంగళవారం తనిఖీ చేశారు. కూలీల మస్టర్, పని ప్రదేశాల్లో నీడ వసతిని పరిశీలించి కూలీలకు వేసవి కాలంలో అందుతున్న వసతులపై ఆరా తీశారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూలీలకు పంపిణీ చేశారు.

26న వినుకొండలో జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఈ నెల 26వ తేదీ మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. నరసరావుపేటలోని ఆయన స్వగృహంలో జాబ్‌మేళా పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వినుకొండ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉదయం 9గంటల నుంచి మేళా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. వినుకొండ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఇలాంటి జాబ్‌మేళాలు నిర్వహిస్తుందని వివరించారు. ప్రతిఒక్క నిరుద్యోగి జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు.

ముందస్తు పత్తి పంట సాగు వైపు రైతులు మొగ్గు

దుర్గి: పల్నాటి ప్రాంతంలోని రైతులు తమ బోర్ల కింద ఉన్న పత్తి పంట సాగుకు సన్నద్ధమై వేలాది హెక్టార్లలో సాగుబడి చేస్తున్నారు. ఖరీఫ్ కాలంలో మొదలయ్యే జూన్, జులై నెలలో సాగు చేయవలసిన పత్తి పంటను ముందస్తుగానే మండలంలో పత్తి పంటను సాగులోకి తీసుకొచ్చారు. నీటి వనరులు ఉన్న రైతులు తమ పొలాల్లో పత్తిని సాగు చేసి అక్టోబర్, నవంబర్ నాటికి పత్తి పంట కాపుకు వస్తుంది. దీంతో పత్తిని తీసి చెట్లను తొలగించి మిర్చి పంట వేసేందుకు రైతులు పూర్తి స్థాయిలో సన్నద్ధమౌతున్నారు. ముందుగా పంట వేయడంతో కూలీల కొరత, పెట్టుబడి, మందు పిచికారీ, సంబంధిత వ్యవసాయ పనుల్లో దాదాపుగా సగం పెట్టుబడితో పత్తిని పండిస్తున్నారు. మామూలు సమయంలో పత్తి పంట సాగుచేసినప్పుడు 12 నుంచి 16 సార్లు మందును పిచికారీ చేయాల్సి ఉంటుంది. కానీ ముందస్తు పంటకు 8 నుంచి 10 సార్లు పిచికారీ చేస్తే సరిపోతుందని రైతులు చెబుతున్నారు. అదే విధంగా కూలీల కొరత లేకుండా తమకు అవసరమైన కూలీలు అందుబాటులో ఉంటున్నట్లు వివరించారు. దిగుబడి విషయంలో సగటున 15 నుంచి 20 క్వింటాళ్ళ పత్తి దిగుబడి వస్తోంది. మొదట వచ్చిన పత్తికి మార్కెట్‌లో మంచి మద్దతు ధర లభించడంతో రైతులు ముందస్తు పంటకు మొగ్గు చూపుతున్నారు. బోర్లు ఉన్న రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం సమకూరుతుందని తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ అందడంతో సాధ్యం



రాష్ట్ర ప్రభుత్వం రైతులకిచ్చిన వాగ్దానం మేరకు పగటి పూట 9 గంటలు, విద్యుత్ మూడు ఫేజ్‌లు ఇవ్వడంతో మేము నడివేసవి కాలంలో పత్తి పంటను సాగు చేస్తున్నాం. ఈ సీజన్‌లో నేను 14 యకరాల్లో ముందస్తు పత్తి పంటను సాగుచేశాను. దీనికి ప్రభుత్వం నుంచి అందిస్తున్న కోతలు లేని విద్యుత్తే కారణం.

– జాస్తి రామ్మూర్తి, రైతు, ముటుకూరు



ఏపుగా పెరిగిన పత్తి పంట

వై నాట్ 175 క్రికెట్ టోర్నమెంట్

పిడుగురాళ్ల: గెలుపు, ఓటమిలను సమన్వయంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ నాయకులు కుందుర్తి గురవాచారి, కో ఆపషన్ సభ్యులు శెట్టుపల్లి పూర్ణ అన్నారు. పట్టణంలోని కళ్లం టౌన్ షిప్‌లో నిర్వహించి వై నాట్ 175 క్రికెట్ టోర్నమెంట్‌లో మంగళవారం క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. ఎవరైనా గెలవడం, ఒడడం క్రీడల్లో సహజమని, ఓటమిని స్ఫూర్తిగా తీసుకుని మరింతగా ఎదగాలని వారు సూచించారు. అనంతరం మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అందుకున్న క్రీడాకుడికి బహుమతిని అందజేశారు. కార్యక్రమం వైఎస్సార్ సీపీ గురజాల నియోజకవర్గ నాయకులు గొట్టిముక్కల పవన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ యూత్ కన్వీనర్ మందా సుదీర్, దయాకర్, రత్నబాబు, ఆవుల పుల్లారావు తదితరులు ఉన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కుందుర్తి గురవాచారి, శెట్టుపల్లి పూర్ణ

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మబుజ్జి

గురజాల : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయడం జరుగుతుందని ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి అన్నారు. మండల పరిధిలోని మాడుగుల గ్రామంలో ఎర్త్ వర్కు నిర్వహించుటకు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సహకారంతో ప్రోక్లయిన్‌ను ద్వారా పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణం, పోలం బాటలు వేయడం వంటి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండ్ల వెంకయ్య, సర్పంచ్ జి సాగర్ బాబు, సిద్దాడపు మురారి, కుర్రా గురవయ్య, ఎంపీటీసీ చల్లా వెంకటేశ్వర్లు, తదితరులున్నారు.

నేటి నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీలు

నాదెండ్ల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2022-23 సంవత్సరానికి 15వ విడత సామాజిక ప్రజావేదిక తనిఖీలు బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఏపీఓ పుష్పరాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఎస్ఆర్‌పీలు, డీఆర్‌పీలతో కో ఆర్డినేషన్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, 2023-23లో అన్ని పంచాయతీల్లో రూ.6,61,22,169 పనులు జరిగాయన్నారు. ఒక ఎస్ఆర్‌పీ, 8 మంది డీఆర్‌పీలతో ప్రతి గ్రామంలో సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ జాకీర్‌హుసేన్, ఎస్ఆర్‌పీ ఎం.బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



వలంటీర్లకు సన్మానం

నరసరావుపేట: పదోవార్డు గ్రామ సచివాలయం వలంటీర్లను మంగళవారం సన్మానించారు. కార్యక్రమానికి మాజీ కౌన్సిలర్లు మాగులూరి రమణారెడ్డి, బీఎస్ రామకృష్ణంరాజు హాజరయ్యారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు కుల, మతం, పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ అందుతున్నాయంటే అదీ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల కృషి ఫలితమే అన్నారు. వార్డు పరిధిలోని వలంటీర్లను సన్మానించారు.



జూన్ 3న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

నరసరావుపేట: అరుణాచలంలో జూన్ ఐదో తేదీ నిర్వహించనున్న గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సు జూన్ 3వ తేదీ రాత్రి 10 గంటలకు బయలుదేరి నాలుగో తేదీ శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్‌టెంపుల్ దర్శించుకుంటూ ఐదో తేదీ ఉదయం నాలుగు గంటలకు అరుణాచలం చేరుకుంటుందని చెప్పారు. భక్తులందరూ గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకొని అరుణాచలేశ్వరుని దర్శనం అనంతరం అదే రోజు సాయంత్రం బయలుదేరి ఆరో తేదీ ఉదయం ఐదు గంటలకు నరసరావుపేట చేరుకుంటుందని వివరించారు. భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టికెట్ వెల ఒక్కొక్కరికి రూ.2550 అన్నారు. వివరాలకోసం 73828 96041, 73828 96038, 99592 25428 నంబర్లను సంప్రదించాలని కోరారు.